క్లుప్తంగా

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు క్రాస్‌లోని మిత్ర కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 11గంటలకు ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. తరగతుల ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు.

18నుంచి శ్రీచక్ర ప్రతిష్ఠాపన



హన్మకొండ అర్బన్: ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం ఖాసింపేటలోని మానసాదేవి క్షేత్రంలో శ్రీచక్ర ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు మానసాదేవి మహా క్షేత్ర ట్రస్టు చైర్మన్ ఎలేటి చంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు చీఫ్ విప్ వినయ్‌భాస్కర్‌ను ట్రస్టు సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

కమిషనర్‌కు పుత్రోత్సాహం

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తండ్రయ్యారు. హైదరాబాద్‌లోని ఫెర్నాండేస్ ఆస్పత్రిలో కమిషనర్ సతీమణి అఫ్రీన్ శనివారం ఉదయం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. కమిషనర్ సతీమణి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ కమిషనర్ క్యాంపు కార్యాలయానికి సోమవారం వచ్చిన కమిషనర్‌కు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం మత్తులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి హల్‌చల్

వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. మద్యం తాగి సోమవారం ఉదయం 10.30గంటలకు కార్యాలయానికి చేరుకుని పౌర సేవ కేంద్రంలో, ఇన్‌వార్డు, అవుట్‌వార్డు సిబ్బంది విధులకు సదరు ఉద్యోగి ఆటంకం కలిగించాడు. దాంతో ఆ ఉద్యోగిని కార్యాలయం నుంచి బయటకు పంపించిన సంఘటన బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా కొంతమంది నాలుగవ తరగతి ఉద్యోగులు మద్యం తాగి విధులకు హాజరవుతున్నారనే ఫిర్యాదులున్నాయి.

కాజీపేటలో మహాన్నదానం



కాజీపేట: కాజీపేట చౌరస్తాలో సోమవారం రాత్రి గౌరి గోశాల నిర్వాహక కమిటీ సభ్యులు 350 మంది పేదలకు అన్నదానం చేశారు. గోశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాశికంటిశోభ, వీరేశం దంపతుల ఆధ్వర్యంలో రైల్వే జంక్షన్, బస్టాండు ప్రాంతాల్లో ప్రయాణికులు, యాచకులకు ఆహారం అందజేశారు.

మేరు సంఘం జేఏసీ కన్వీనర్‌గా సుమన్



వరంగల్: మేరు సంఘం వరంగల్ జిల్లా జేఏసీ కన్వీనర్‌గా కాశిబుగ్గకు చెందిన గూడూరు సుమన్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర మేరు జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మునిగాల రాము, వ్యవస్థాపక అధ్యక్షుడు సంగ వెంకటరాజం, రాష్ట్ర కోకన్వీనర్ కీర్తి జయంత్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జేఏసీ ప్రధాన కార్యదర్శిగా గట్ల నరేందర్, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి రమేష్, కీర్తి ఉదయ్, అడప సురేష్, జాయింట్ సెక్రెటరీగా అడప రజితను నియమించినట్లు వివరించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా విల్సన్ మాదిగ



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురానికి చెందిన జెరిపోతుల విల్సన్ మాదిగను హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన వెంకటస్వామికి విల్సన్ కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాలీకి తరలిన నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు బీఆర్ఎస్ అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న నన్నపునేని నరేందర్.. భద్రకాళి ఆలయం నుంచి సోమవారం ప్రారంభించిన మోటార్ బైక్ ర్యాలీకి కాశిబుగ్గకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యులు గోరంటల మనోహర్, బీఆర్ఎస్ నాయకులు ఓని భాస్కర్, వేముల నాగరాజు పాల్గొన్నారు.



యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



కేయూ మైక్రోబయాలజీ విభాగంలో..



కాజీపేటలో కోలాటం ఆడుతున్న మహిళలు

కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సతీమణి తాటికొండ భావన సంబరాల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కవిత, అధ్యాపకులు భాగ్యలక్ష్మి, కవిత, సుజాత, లలితకుమారి, రామ్మోహన్, రవీందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

కేయూ మైక్రో బయాలజీ విభాగంలో..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మైక్రో బయాలజీ విభాగం ఆవరణలో సోమవారం సాయంత్రం విద్యార్థినులు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మైక్రో బయాలజీ, బాటనీ, బయో కెమిస్ట్రీకి చెందిన పలువురు విద్యార్థినులు రంగురంగుల తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.



ఖిలా వరంగల్: న్యూకౌటిల్యాస్ స్కూల్‌లో..



49వ డివిజన్‌లో కార్పొరేటర్ మానస, మహిళలు

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలో జయభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మాజీ కార్పొరేటర్ కోల వినోదతో కలిసి కాలనీవాసులు బతుకమ్మ ఆడారు.

న్యూ కౌటిల్యాస్ హైస్కూల్‌లో..

ఖిలా వరంగల్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు కాపాడుతూ బంగారు బతుకమ్మను భావితరాలకు అందించాలని న్యూ కౌటిల్యాస్ ఎస్‌పి హైస్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ పిలుపునిచ్చారు. వరంగల్ 39వ డివిజన్ కరీమాబాద్‌లోని న్యూ కౌటిల్యాస్ ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు



మడికొండ: పూజ చేస్తున్న పూజారి అభిలాష్‌శర్మ



అనఘాష్టమి వ్రతం చేస్తున్న మహిళలు

మడికొండ: నగరంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు. రెండో రోజు మహంకాళి దేవాలయంలో శైలత్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మడికొండ చౌరస్తాలో సుభాష్‌యూత్ ఆధ్వర్యంలో నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

కల్యాణి అలంకరణలో రాజరాజేశ్వరి

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని కల్యాణిగా అలంకరించి పూజలు చేశారు.

సీతారామచంద్ర స్వామి దేవాలయంలో..

ఖిలా వరంగల్: శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో వేద పండితుడు రాజేంద్రప్రసాద్ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహించారు.



కల్యాణి అవతారంలో రాజరాజేశ్వరి



ప్రత్యేకాలంకరణలో శారదాంబ అమ్మవారు

శంకరమఠంలో..

రామన్నపేట: శృంగేరి శంకర మఠంలో సోమవారం గాయత్రీ హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర శర్మ, సాయిగణేష్ శర్మ, విశాల్ శర్మ, వివేక్ వర్మ.. శారదాంబ అమ్మవారికి, చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు.

మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

కాశిబుగ్గ : వరంగల్ జిల్లాలో మిర్చి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఇసంపల్లి బాబు అన్నారు. సోమవారం శివనగర్ ఏసీరెడ్డి నగర్ రఘునాథ్‌భవన్‌లోని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో లింగాల మల్లయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు, రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని, 75 ఏళ్ల వయసు గల రైతులకు రైతు బీమా వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రం, కేంద్ర ఫసల్ బీమా నుంచి బయటికి రావడంతో రాష్ట్రం సొంత పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలుచేయాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రైతులకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలో పంటల ధర నిర్ణయానికి కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తే రైతులకు లాభంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు.

డిబేట్‌లో బీజేపీ, బీఆర్ఎస్ నేతల గొడవ

ఖిలా వరంగల్: మధ్యకోటలో సోమవారం సాయంత్రం ఓ టీవీ చానల్ నిర్వహించిన డిబేట్ రణరంగం మారింది. బీజేపీ నేతలపై అధికార పార్టీ నేతలు విరుచుకుపడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు శ్రుతిమించి కుర్చీలతో కొట్టుకున్నారు. ఈ దాడుల్లో బీజేపీకి చెందిన కార్యకర్త మెరుగు ఉదయ్‌కు గాయాలు కాగా, సంబంధిత పార్టీ నేతలు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. దాడులను ప్రత్యేకంగా చూసిన ఓ చానల్ హడలెత్తింది. దాంతో అర్ధంతరంగా డిబేట్‌ను ముగించి అక్కడి నుంచి చానల్ వాళ్లు జారుకున్నారు. పోలీసులు అధికార పార్టీ నేతలకు కొమ్ముకాశారని విమర్శలు వెల్లువెత్తాయి. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీ ఝులిపించడంతో అక్కడి నుంచి నేతలు, కార్యకర్తలు వెళ్లిపోయారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: తాము చేసిన మంచిని ప్రచారం చేద్దామని, బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అన్నారు. నగరంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సోషల్ మీడియా వారియర్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియా వారియర్స్‌పై ఉందని గుర్తుచేశారు. అనంతరం బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్, రెడ్ కో చైర్మన్ వై.సతీష్.. సోషల్ మీడియా వారియర్స్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

దోపిడీ పాలన అంతమే.. ఉద్యమకారుల పంతం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నయీంనగర్: సబ్బండ వర్గాల పోరాటం, త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో అన్ని వర్గాలను మోసం చేసిన కల్వకుంట్ల ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని వారి పాలనను అంతం చేయడమే ఉద్యమకారుల పంతం కావాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం సదస్సులో ఆయన పాల్గొని ఉద్యమకారుల వేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దుష్టపాలనకు వ్యతిరేకంగా రెండేళ్ల నుంచి పౌర సమాజం పోరాటం చేస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ ఎన్నో తప్పులు చేశాడని రాష్ట్రసాధన కోసం ఉద్యమకారులు అన్నీ భరించారన్నారు.

కేయూ మాజీ ఏఆర్ సారయ్య మృతి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్, కేయూ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ మామిండ్ల సారయ్య (64) సోమవారం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సారయ్య మృతిపై కేయూ రిటైర్డ్ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నాగేశ్వర్‌రావు సంతాపం తెలిపారు.

సుమన్‌కు కలాం జాతీయ అవార్డు ప్రదానం



సుమన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

వరంగల్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని హనుమకొండ నయీంనగర్‌లోని అరోమా హాల్‌లో వెనిశెట్టి జగదీశ్వరయ్య స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల్లో విద్యారంగంలో, వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి జాతీయ స్థాయి అబ్దుల్ కలాం టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ రంగంపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సామాజిక సేవకుడు, బ్లడ్ డోనర్, మోటివేటర్ గజ్జెల సుమన్‌కు నేషనల్ టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వెనిశెట్టి రవికుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్జి వై.సత్యేంద్ర, అంజనికుమారి, ఫౌండేషన్ చైర్మన్ వెనిశెట్టి రవికుమార్, అవోపా జిల్లా గవర్నర్లు పాల్గొన్నారు. కాగా, అవార్డు అందుకున్న సుమన్‌ను ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, అతని సన్నిహితులు అభినందించారు.

ప్రవళిక కుటుంబానికి మంత్రి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న తాళ్లపెల్లి నరేష్

కేయూ క్యాంపస్: దుగ్గొండి మండలం బిక్కజిపెల్లికి చెందిన మర్రి ప్రవళిక పోటీపరీక్షల వాయిదాలతో తీవ్ర మనస్తాపానికి గురై హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంటే బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సానుభూతి చూపాల్సిందిపోయి ఐటీశాఖమంత్రి కేటీఆర్ ఆమె ఆత్మహత్యపై నిరాధారమైన అబండాలు వేసి గ్రూప్–2 కు ప్రవళిక అసలు దరఖాస్తుచేయలేదని అబద్దాలతో కూడిన స్టేట్‌మెంటు ఇవ్వటం శోచనీయమని మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (కుర్సా)అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీలోని వివేకానంద రీసెర్చ్‌స్కాలర్ హాస్టల్‌వద్ద నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

డాక్టరేట్ గ్రహీత అశోక్‌కు సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎలిశాల అశోక్‌కు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఓయూలో కెమిస్ట్రీ విభాగంలో పరిశోధకుడిగా అశోక్.. డిజైన్ మాలిక్యూలర్ మోడలింగ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ 1, 8 నాఫ్తారీడినైల్ హెటిరో సైక్లిక్స్ అండ్ దేర్ బయాలాజికల్ ఎవాల్యూయేషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సక్రం పర్యవేక్షణలో అశోక్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. కాగా, అశోక్‌ను హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు.

ఘనంగా అనస్తీషియా డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అనస్తీషియన్లు, సిబ్బంది

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వరల్డ్ అనస్తీషియా డే వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనస్తీషియన్ ప్రొఫెసర్ హన్మంతరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడారు. 1846, అక్టోబర్ 16వ తేదీన డబ్లూటీజీ మోర్టాన్.. ఎలాంటి నొప్పి లేకుండా ఆపరేషన్ చేశారని గుర్తుచేశారు. ఆ రోజును వరల్డ్ అనస్తీషియన్ డేగా జరుపుకుంటున్నట్లు వివరించారు. వైద్యులు నాగరాజు, సాగర్, పద్మావతి, స్ఫూర్తి, శ్రీనివాస్ నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుశీల పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మహిళలు అండగా నిలవాలి

హన్మకొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సోనియాగాంధీకి అండగా నిలబడి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని ఏఐసీసీ పరిశీలకుడు ఉత్తమ్‌రావు దళ్వీ మహిళలను కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ 9వ డివిజన్ పెద్దమ్మగడ్డ సమీపంలోని ఐకే గార్డెన్‌లో మహిళా సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన దళ్వీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి పేదల కష్టాలను దూరం చేస్తామన్నారు. జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. దాస్యం వినయ్‌భాస్కర్ నాలుగుసార్లు గెలిచి వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని సమస్యల ఊబిలోకి నెట్టారన్నారు.

పండుగ వేళ వేతనాల్లో హెచ్చుతగ్గులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, అర్బన్ మలేరియా ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు కొందరికి ఎక్కువగా, మరికొందరికి తక్కువగా జమయ్యాయి. సెప్టెంబర్‌కు సంబంధించిన వేతనాల్ని ఈనెల 13న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పండుగల వేళ తక్కువ వేతనం జమైన కార్మికులు ఆందోళన చెందారు. ఔట్ సోర్సింగ్ వాహనాల డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు తక్కువ జమ కాగా.. అర్బన్ మలేరియా సిబ్బందికి వేతనాలు ఎక్కువ మొత్తంలో జమ య్యాయి. వేతనాల్లో తేడాలపై బల్దియా కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, నాయకుడు పడా రాంమూర్తి తదితరులు అడిషనల్ కమిషనర్ రషీద్, సీఎంహెచ్‌ఓ రాజేశ్ దృష్టికి తీసుకెళ్లారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

హన్మకొండ: నిరుద్యోగ అభ్యర్థి ప్రవళిక మృతిపై అవాస్తవాలు మాట్లాడుతున్న.. మంత్రి కేటీఆర్ ఆమె కుటుంబ సభ్యులు, యువతకు క్షమాపణ చెప్పాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యానగర్‌కు చెందిన కేయూ విద్యార్థి నాయకుడు నవజీవన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు బీజేపీలో చేరారు. రావు పద్మ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

మృతుడి నేత్రాల దానం

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోటకు చెందిన గద్ద భాస్కర్ (55) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భార్య భారతి, కూతుళ్లు మౌనిక, రేఖ.. మృతుడి నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో మృతుడి నేత్రాలు సేకరించారు.

డాంబర్ యంత్రంలో పడి వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్: డాంబర్ తయారీ యంత్రంలో పడి ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మిల్స్‌కాలనీ పీఎస్ పరిధి ఖిలా వరంగల్ మండలం జక్కలొద్ది శివారులో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం జక్కలొద్ది గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో సీపీఎం ఆధ్వర్యంలో వెలసిన ప్రగతినగర్ కాలనీలో కార్మికుడు చెరుకులపెల్లి ఎల్లయ్య(50) కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. రోజుమాదిరిగానే సోమవారం ఉదయం జక్కలొద్ది గుట్టల సమీపంలోని శ్రీలక్ష్మీ మెటల్స్ అండ్ బిల్డర్స్ డాంబర్ తయారీ కంపెనీలో పనికి వెళ్లాడు. మధ్యాహ్నం డాంబర్ యంత్రం వద్ద పనిచేస్తుండగా అందులో పడి దుర్మరణం చెందాడు.

మేనేజిరియల్ స్కిల్స్ పెంచుకోవాలి

నయీంనగర్: విద్యార్థులు మేనేజిరియల్ స్కిల్స్ పెంచుకొని వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు సూచించారు. హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్, ఇండక్షన్ ప్రోగ్రాంను ప్రారంభించారు.

పరకాల టికెట్ కొండా మురళికే ఇవ్వాలి

నయీంనగర్: స్థానికుడైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండా మురళీధర్‌రావుకే పరకాల అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని పరకాల మండల కాంగ్రెస్ పార్టీ కోరింది. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి మాట్లాడారు.

గీత కార్మికులకు సభ్యత్వం అందజేత

కాజీపేట: రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఘనత కల్లుగీత కార్మిక సంఘానికే దక్కుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ అన్నారు. సోమిడి గ్రామ శివారులో గీత కార్మికులకు సంఘం సభ్యత్వాలను సోమవారం అందజేశారు.

తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేస్తాం

హసన్‌పర్తి: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ధీమా వ్యక్తం చేశారు. 56, 65వ డివిజన్లకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోరుతూ 56వ డివిజన్‌లోని పలు కాలనీల్లో నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు.

లారీ – బైక్ ఢీ.. భార్యాభర్తలకు గాయాలు

ఖిలా వరంగల్: లారీ అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో భార్య, భర్తలిద్దరికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై హంటర్ రోడ్డు మెడికేర్ ఆస్పత్రి సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కరీమాబాద్‌కు చెందిన రమేష్, పుష్పలత దంపతులు వ్యక్తిగత పనుల మీద హనుమకొండకు వెళ్లి తిరిగి బైక్‌పై బయల్దేరారు. ఈక్రమంలో మెడికేర్ ఆస్పత్రి సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది.

రావణ ప్రతిమ ఏర్పాటు పనులు ప్రారంభం

కాజీపేట రూరల్: 47వ డివిజన్ బాపూజీనగర్ (కడిపికొండ బ్రిడ్జి) సెంటర్ వద్ద లెవెన్ స్టార్ యూత్ అసోసియేషన్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణ ప్రతిమ ఏర్పాటు పనులను సోమవారం ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వరంగల్: ఈనెల 17, 18 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నగరంలోని 14వ డివిజన్ రెడ్డిపాలెం ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ కృప మరియా మాట్లాడుతూ తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు కిరీటి, సద్విన్, అద్విత్, బాలివన్‌రాజ్, వరుణ్ ఎంపికయ్యారని తెలిపారు. వారిని ప్రిన్సిపాల్‌తోపాటు, వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్ అభినందించారు.

ఘనంగా 'మేరీ మిట్టీ.. మేరా దేశ్'



కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

హసన్‌పర్తి: భీమారంలోని శ్రీఅరుణోదయ డిగ్రీ, పీజీ కళాశాలల్లో మేరీ మిట్టీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సుమన్, అధ్యాకులు విజయ్‌కుమార్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ వనిత కుమారి, అర్చన, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.